


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**82**

(15 ' నవంబర్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**కాలం మళ్ళీ** వెనక్కిపోతోంది. పోక ఏం చేస్తుంది. ఎంతదూరం క్రొత్తకోసం పరుగెత్తింది. నురుగులు క్రక్కుతూ పరుగెత్తితే సరా బరువులు మోయొద్దు.

పాత ఆచారాలకు మళ్ళీ ప్రాధాన్యత వస్తోంది. వాటి గొప్పతనం కొద్ది కొద్దిగా గ్రహిస్తున్నారు. ఆచరణలోకి తేవడం కూడా ప్రారంభిస్తున్నారు.

చాలాకాలం క్రిందట ఆషామాషిలో రాగి కడియాలు ధరించడం విషయం వ్రాశాను. విజయవాడలో వాటిని గురించి ఉష్శశ్రీగారు చేసిన ప్రచారాన్ని కూడా వివరించాను. రాను రాను 'రాగి' సర్వరోగ నివారణగా రూపొందింది.

***రాగి కడియం రోగ నివారణ***

రాగి కడియాలు ధరించినవారి సంఖ్య పెరిగిపోతోంది నానాటికీ. అందరూ తమ రుగ్మతలు తగ్గిపోతున్నాయనే చెప్తున్నారు. పూర్వం మంత్రించిన రాగి బిళ్ళలు, తాయొత్తులూ కడితే ఆరోగ్యం బాగుపడేది. ఇప్పుడు మంత్రం లేదు తంత్రం లేదు.

రాగి ముక్క దొరికితే వంచి చేతికి వేసుకోవడమే దాంతో రోగాలన్నీ ఎగిరిపోతున్నాయట ఒకచోట కాదు భారతదేశమంతటా ఈ చికిత్స ప్రారంభమైంది. నేను చాలామందిని అడిగాను, ఫలితమేమిటి? అని. ఒకాయన చెప్పాడు - ఏడాదికి పైనుంచీ ఉన్న ఆయాసం సునాయాసంగా తగ్గిపోయిందట అదివరలో మేడమీదకు వెళ్ళాలంటే మెట్టుమెట్టుకీ ఆయాసం వచ్చేదట ఇప్పుడు రోజుకు పదిమాట్లు బంతిలాగా పైకెగురుతున్నాడుట. క్రిందకు దిగుతున్నాడట.

మరో ఆయన చెప్తాడు - తనకు తరుచు తలనొప్పివస్తూ ఉండేదట ఇప్పుడది బొత్తిగా రావడంలేదట. రాగి ముక్క మహాత్మ్యంతో తాను రోగనివృత్తి పొందానని ఆయన ఎంతో సంతోషంగా చెప్పాడు.

***గుండెనొప్పులు కీళ్ళనిప్పులు, తలనొప్పులు పరారు?***

ఇంకో మిత్రునికి రాగి కడియం ధరించిన తర్వాత కీళ్ళ నొప్పులు రావడం పూర్తిగా మారిందిట. అంతకు ముందు ఎంతో మందులు వాడాడుట. వేలకు వేలు ఖర్చుపెట్టాడట. ఇప్పుడు కీళ్ళు ఇనప గొళ్ళాలకంటె గట్టిగా ఉన్నాయట.

ఇలాంటి ఫలితాలు అందుకోగలవారెందరో ఉంటారు దేశంలో. అందరి కథలూ వ్రాస్తే ఎంత బాగుంటుందో! రాగి కడియం ధరించడమే కనుక ప్రతివారూ, మతంతో సంబంధం లేకుండా ధరించడం జరుగుతోంది. ఇది ప్రకృతి అందించిన వరంగా అందరూ భావించడం గమనించతగ్గ విషయం.

బెంగుళూరు నుంచి వచ్చిన ఒక కన్నడ మిత్రుని చేతికి కడియం ఉండటం చూశాను మొన్న. హైదరాబాద్‌లో ఉన్న ఒక క్రిష్టియన్ ఫాదర్ చేతికీ ఉండటం చూశాను. ఇద్దరూ తమ ఆరోగ్యాలు బాగున్నాయని, చెప్పారు సంతోషంతో.

ఇక్కడేమిటి? బొంబాయి నగరంలో ఈ కంకణధారణ మరీ ఎక్కువగా ఉందట. అక్కడ ప్రతి వీధిలో ఈ కంకణాలు రూపాయి ధరకు అమ్ముతున్నారుట అది సరి అయిన రాగి అవునా కాదా? అనే పరిశీలన కూడా లేకుండా కొనేస్తున్నారుట

***కొందరికి విస్మయాలు: కొందరికి సంశయాలు***

నిజంగా వీటివల్ల రోగాలు నయమవుతున్నాయా? అనేది ప్రశ్న వేడిని తీసివేసే గుణం రాగిలో ఉంది గనక ఈ ఫలితాలు అందుతున్నాయంటున్నారు కొందరు. నెత్తురుపోటు కూడా తగ్గుతోందని కొందరు చెపుతున్నారు.

అయితే వేడిని ఆకర్షించే గుణం జింక్, అల్యూమినియం, టిన్ మొదలైన లోహాలలో కూడా వుందిగదా - రాగికి ఒక్కదానికే యింత ప్రాముఖ్యం రావడమేమిటి? అంటున్నారు కొంతమంది.

'ఇది కేవలం కంకణం ధరించిన తర్వాత మానసికంగా కలిగే మార్పు అయివుంటుంది. ఆ మార్పు మంచి మందుగా పరిణమించి ఉంటుంది. అంతేగాని రుగ్మతలెక్కడ పోతాయి? - అంటున్నారు మరికొందరు.

అయితే వీటిని ధరించేవారిలో ఎక్కువ మంది పురుషులే ఉంటున్నారు వారిలో విద్యాధికులు, వ్యాపారవేత్తలు, అనుభవజ్ఞులు చాలామంది ఉన్నారు. వీరందరూ మూఢ విశ్వాసంతో రోగాలు పోతున్నాయని చెప్పుకునే స్థితిలో ఉంటారా! అనేదికూడా విచారించవలసిన విషయం.

చాలామంది ఆసక్తిపరులు చేతికి రాగి కడియం తొడుక్కోవడానికి కొంచెం సంశయిస్తున్నట్లున్నారు. రాగితో రిష్టువాచీలకు స్ట్రాప్‌లు ఏ కంపెనీవారయినా తయారుచేస్తే కావలసినంత బేరం ఉంటుందనే నా భావం. అసలైన రాగితో అందంగా, నగిషీలతో వాటిని తయారుచేస్తే - ఉభయతారకంగా ఉంటుంది కొనేవాళ్ళకు.

***రాతియుగంనుంచీ రాగిమోజు***

రాగిలో ఏదో గొప్ప శక్తి ఉన్నదనే విషయం ఈనాడు తెలుసుకున్నది కాదు. రాతి యుగంలోవారు కూడా రాగిని రోగనివారిణిగా, ఉపయోగించేవారు. రాగిలో గల మన్నిక, కాంతీ ప్రజల్ని ఎక్కువుగా ఆకర్షించేదట. అందువల్ల వాటితోనే ఇంట్లో చెంబులు, వగైరా పనిముట్లు తయారు చేయించుకునేవారు.

పూర్వం పల్లెటూళ్ళలో చాలామంది రాగి డేగిసాలలో అన్నం వండుకోవడం చూశాను. వారనేవారు "ఇత్తడి గిన్నెతో వండిన కూడు అరగదు మహానుభావా? పైగా అతివేడి" అని ఈ డేగిసాలవంట ఇప్పటికి కొందరి ఇళ్ళల్లో ఉంది. కాని రాగి ఖరీదు ఎక్కువ కావడం వల్ల జర్మన్ సిల్వర్ ఎక్కువగా వాడకంలోకి వచ్చింది. ఇప్పుడు వైట్ మెటల్ యుగం వచ్చింది.

రాగి పళ్ళాలు, పంచపాత్రలు, ఉద్ధరిణులు, చెంబులు - వగైరాలు ఎక్కువగా వాడబడుతూ ఉండేవి. కాశీనుంచి గంగాజలం రాగి చెంబులతో తెచ్చి దాచుకుంటారు. పూర్వం చాలామంది రాగి కడియాలు వేసుకునేవారు. రాగి బిళ్ళలు మెడలో ఉండేవి. రాగి తాయెత్తులు ప్రతి బిడ్డకూ కట్టేవారు. కాళ్ళకు రాగి కడియాలు వేసుకునేవారు మొగవాళ్ళు కూడా వాటిని 'వెంకన్న' కడియాలనేవారు జబ్బలకు రాగి దండకడియాలు ధరించేవారు.

***బొంబాయిలో రోజుకు 7000 కడియాలు***

కారణం ఏమైనా కానివ్వండి మళ్ళీ 'రాగిమోజు' దేశంలో తల ఎత్తింది. ప్రతిరోజూ వేలకు వేలు కడియాలు అమ్ముడుపోతున్నాయి. ఒక బొంబాయిలో రోజుకు 7000 కడియాలు అమ్ముడుపోతున్నట్లు వ్రాశాడొక జర్నలిస్టు.

పారిశ్రామిక వేత్తలు మాత్రం ఈ రాగిమోజు తలుచుకుని భయపడుతున్నారు. అసలే దేశంలో రాగి అతి కరువుగా ఉంది. ప్రస్తుతం విదేశాల నుంచి అరవైకోట్ల రూపాయల విలువగల రాగి దిగుమతి చేసుకోవలసి వస్తోంది. పై సంవత్సరానికి 1,24,000 టన్నుల రాగి అవసరమవుతుందనీ, దానిలో సుమారు 26,000 టన్నులు దేశంలో ఉత్పత్తి అవుతుందనీ అంచనా వేశారు.

పోతే లక్ష టన్నుల కొరత ఈ కొరతలో ఈ మోజు బయలుదేరింది. ఇంకెంత కొరత వస్తుందో వీటివల్ల తెలియదు. కొరతమాట ఎలావున్నా రుగ్మతలు తొలిగిపోతే సంతోషించవచ్చు. కొరతలు మనకు ఎందులో లేవు గనుక.

***తామ్రపత్రాలు.. ఆరోగ్య సూత్రాలు***

ఇటీవల స్వాతంత్ర్య యోధులకు ఎన్నో వేలమందికి ప్రభుత్వం సత్కారాలు చేసింది. ఆ సమయంలో వారి తామ్రపత్రాలు బహూకరించడం జరిగింది. ఏమిటా ఇవి ఇచ్చారని చాలామంది అనుకున్నారు. కానీ వాటి విలువ ఇప్పుడు తెలుస్తోంది. ఆ పత్రాల్ని కంకణాలుగా చేయించి ఇంటిల్లపాదికీ వెయ్యవచ్చు. వాటిద్వారా ఆరోగ్యభాగ్యాన్ని పొందవచ్చు.

కొందరికి ఆ పత్రాలను చెడగొట్టడం ఇష్టంలేకపోతే వాటిని ఏ గూట్లోనో అలంకారం క్రింద పెట్టి ఉంచక - నిద్రపోయేటప్పుడో, వెనుకటి చరిత్రను నెమరు వేసుకునేటప్పుడో గుండెలమీద పెట్టుకుంటే మంచి ఆరోగ్యాన్నిస్తాయి. ఆరోగ్యానికి మించిన మహద్భాగ్యం మరొకటి ఏం ఉంటుంది?

మొత్తానికి రాగికి మంచి గిరాకీ దానితోపాటు గౌరవం వచ్చాయి. వాటి పుణ్యమా అంటూ కొందరి రుగ్మతలు నయమైతే ఎం.బి.బి. యస్ సీట్ల త్రొక్కిసలాటన్నా కొంత తగ్గుతుందేమో!

Post your comments